

# కాకతాళీయం

"ఎక్స్‌క్యూజ్‌మి జంటిల్‌మెన్. ఫోన్‌కాల్ ఒకటి చెయ్యాలి"

చేతి గడియారంవంక చూసుకుని అన్నాడు కృపలాని. బల్లమీద వున్న టెలిఫోన్‌ని కృపలానివైపు జరిపాడు, దాదాపు పాతికమంది విందు చేయడానికి సరిపోయే ఆ టేబిల్ ముందు కూర్చొనున్న ఓ జపనీస్.

కృపలాని అతనివంక కృతజ్ఞతగా చూసి "ప్రియదర్శిని" రిసీవర్ అందుకుని, ఓ నంబర్ డయల్‌చేసి అడిగాడు.

"ఆపరేటర్ ప్లీజ్ పుట్ మి టు రూమ్ నంబర్ జీరో ఎయిట్ నైన్"

ఢిల్లీలోని అశోకా హోటల్‌లో తన ఎయిర్‌కండిషన్డు రూంలో కూర్చుని, ఛేస నవల చదువుతున్న కృపలాని పర్సనల్ సెక్రెటరీ రిసీవర్ అందుకున్నాడు రింగ్ విని.

"హలో కృపలాని హియర్"

వినపడింది అవతల నుంచి.

"యస్ సర్"అన్నాడు సెక్రెటరీ వినయంగా.

"ఇప్పుడు మూడూనలభై అయింది. నాలుగూ పదికి బొంబే ఫ్లయిట్ బయలుదేరుతుంది. కాన్ఫరెన్స్ ఇంకా పూర్తికాలేదు.

"రేపు ఉదయం జనరల్‌బాడీ మీటింగ్‌కి మీరు తప్పకుండా హాజరవ్వాలి సార్."

గుర్తు చేశాడు సెక్రెటరీ.

"అవును గుర్తుంది"

"మరి! ఇవాళ నాలుగూ పదికి బయలుదేరే విమానంలో వెళ్ళకపోతే. రేపు ఉదయం బొంబేలో వుండలేరు. ఇంకో ఫ్లయిట్ లేదు ఇవాళ."

"నాకు తెలుసు ఆ సంగతి. కానీ జపాన్ నుంచి వచ్చిన వీళ్ళందరినీ నిరుత్సాహపరచి బయలుదేరలేను ఇప్పుడు."

"ఇంకా ఎంత సేపు అక్కడుండాలి మీరు?"

"బహుశ ఇంకో రెండు గంటలు వుంటాను ఇక్కడే."

"అయితే జనరల్‌బాడీ......."

"ఆ సంగతి మర్చిపోదాం. రాత్రి ఎనిమిది గంటలకి ఫిక్స్‌డ్ ట్రెంకాల్ బుక్‌చేసి వుంచు బొంబెకి. నా స్పీచ్ ట్రంక్‌లో చదువుతాను. టేప్‌రికార్డుచేసి మీటింగ్‌లో సభ్యులకి వినిపిస్తారు."

"ఓ.కె సర్"

"అయిదున్నరకీ మినిస్ట్రి ఆఫ్ ఇండస్ట్రీస్ ఏర్పాటుచేసే తేనేటి విందులో జపనీస్ స్నేహితులతోపాటు నేనూ పాల్గొంటానని తెలియచేయి వాళ్ళకి. ఇక్కడ వుండననే వుద్దేశంతో నిరాకరించాను ఆహ్వానం ఇవాళ ఉదయం."

"ఓ. కె. సర్"

"ట్రంక్‌కాల్ సంగతి మర్చిపోకు."

"ఓ. కె. సర్"

కృపలాని రిసీవర్‌ని క్రెడిల్‌మీద పెట్టి తనవంక చూస్తున్నజపాన్ ఫర్టిలైజర్సు ట్రేడ్ డెలిగేషన్ సభ్యులవంక చూసి చిరునవ్వు నవ్వాడు.

"నాలుగూపదికి బొంబే వెళ్ళాలా మీరు?" అడిగాడు ట్రేడ్ డెలిగేషన్ హెడ్.

అవును రేపు ఉదయం పదకొండు గంటలకి మా కంపెనీ పద హారవ ఏన్యువల్ జనరల్ మీటింగ్. ఛైర్మన్ కాబట్టి నేను మీటింగ్‌కి తప్పని సరిగా హాజరవాలి"

"వియార్ సారీ. మా మూలంగా మీ ఎంగేజ్‌మెంట్ కేన్సిలయింది"

చిన్నగా నవ్వి అన్నాడు కృపలాని.

"నెవర్‌మైండ్. ఎంతో దూరంలో వున్న జపాన్ దేశం నుంచి, మా భారతదేశంలోని ఫర్టిలైజర్ ఇండస్ట్రీస్‌కి సహాయంచేసే నిమిత్తం మీరు వచ్చారు. కాబట్టి మన కాన్ఫరెన్స్ ముందు ఆ ఏన్యువల్ మీటింగ్ అంత ముఖ్యమయినది కాదు. నేను చెప్పాలనుకున్న నాలుగయిదు సంగతులు రాత్రి ట్రంక్‌ద్వారా చెపుతాను"

"ఇటీజ్ కైండ్ ఆఫ్ యు"

మనచర్చ మొదలుపెడదాం మళ్ళీ" అన్నాడు కృపలానీ అందరి వంకా చూసి"

భారతదేశంలోని ఇతర ప్రాంతాలనుంచి వచ్చిన వ్యాపార ప్రముఖులుకూడా మనసులోనే కృపలానీ కార్యచతురతకు సంతోషపడ్డారు.

కాన్‌ఫరెన్స్ హాలుకు అయిదుమైళ్ళ దూరంలో వున్న, అశోకా హోటల్‌లోని కృపలాని పర్సనల్ సెక్రటరీ మనస్సు మాత్రం ఛెస్ పుస్తకంమీద లేదు.

కృపలానీ ప్రయాణం మీద వుంది.

ఎలాగయినా ఇవాళ కృపలానీ బొంబాయి వెళ్ళేలాగా చూడాలి. అలా వెళ్ళగలిగే ఏర్పాటు తనుచేస్తే కృపలానీ చాలా సంతోషపడతాడు. సెక్రటరీగా తన కృషికి సంతోషించి జీతం పెంచవచ్చు.

ఇవాళ ఒకే ఒక విమానం వుంది బొంబేకి అది ఇంకో పదినిము షాలలో బయలుదేరుతుంది. తరువాత మళ్ళీ బొంబే విమానాలు లేవు. దాంట్లో వెళ్ళకపోతే ఇక రేపు బొంబే చేరుకోలేడు కృపలాని.

టిక్కెట్ కేన్సిల్‌చేస్తే, కృపలాని సీటు, వెయిటింగ్ లిస్టులో

వున్న మొదటి అతనికి ఇవ్వబడుతుంది. కృపలాని ఢిల్లీలోనే వుండి పోతాడు. కాని అలా జరగకూడదు.

అలా జరగకూడదంటే ఏం చెయ్యాలి? విమానాన్ని ఆపాలి. ఎలా ఆపగలడుతను? మినిస్ట్రీ ఆఫ్ కామర్స్‌కి ఫోన్‌చేసి, పరిస్థితి వివరించి, విమానాన్ని ఆపించమంటే వాళ్ళు తను చెప్పినట్లు వింటారని నిశ్చయం ఏమిటి? కృపలానికోసం విమానాన్ని ఆపడానికి ఏర్‌లైన్స్ అధికారులు ఒప్పుకోవద్దూ, కామర్స్ మినిష్టర్ సెక్రటరీ కోరినా?

లాభంలేదు ఆ పద్ధతి మరెలా ఆపడం? కృపలాని పర్సనల్ సెక్రటరీ ఆలోచించ సాగాడు.

* * *

పాలం ఏర్‌పోర్ట్ ఎప్పుడూ రద్దీగా వుంటుంది. భారత రాజధానిలో వుండటంవల్ల, ఇంటర్‌నేషనల్ ఏర్‌పోర్ట్ అవటంవల్ల. వచ్చేపోయే విమానాల సంఖ్య అధికం. వాటిలో చాలాభాగం ఇతర దేశాలకి సంబంధించిన విమానాలే.

రన్‌వే .ద సిద్ధంగావుంది బొంబేకి బయలుదేరే విమానం.

ఏర్‌పోర్ట్ రేడియో రూపంలో కూర్చుని వున్న ఏర్‌లైన్స్ అధికారి, వైర్‌లెస్‌లో, బొంబెకి బయలుదేరే విమానం పైలట్‌తో మాట్లాడుతున్నాడు.

ఇంజన్ స్టార్టు చేశాడు పైలట్ చకచకా.

రేడియో రూంలో కూర్చునివున్న అధికారి చెబుతున్నాడు మైక్ ముందు.

"ఆల్ క్లియర్."

విమానంలోని రెండువందల పదిహేడుమంది ప్రయాణీకులు చెవుల్లో దూదులతో, నడుముకి బిగింపబడిన బెల్టుతో వుత్సాహంగా ఎదురుచూస్తున్నారు, విమానం ఎప్పుడు బయలుదేరుతుందాఅని.

"త్రీ....టు....ఒన్ జీరో"

పైలట్ చేతులు యాంత్రికంగా పనిచేసాయి. విమానం రన్‌వే మీద పరిగెత్తడం మొదలెట్టింది. చెవులు చిల్లులు పడేటప్పుడు.

అయిదు నిముషాల తర్వాత విమానం గాలిలో ఎగురుతోంది. నడుముకి కట్టుకున్న బెల్టు విప్పదీసారు ప్రయాణీకులు. విమానంలో దొరికే నేషనల్, ఇంటర్నేషనల్ మేగజైన్స్ చదువుతున్నారు.

కాక్‌పిట్‌లో పయిలట్ సిగరెట్ తాగుతూ, తన కో పయిలెట్‌తో మాట్లాడుతున్నాడు.

తన పోజీషన్ చెక్ జేసుకుని చెప్పాడు రేడియోలో, డిల్లీ పాలం ఏర్‌పోర్టులోని కంట్రోల్ రూమ్‌కి.

"హలో! జీరో ఫోర్ త్రీ సిక్స్. నార్త్ ఓవర్"

"కంట్రోల్ రూం హియర్. వెంటనే విమానాన్ని వెనక్కి తిప్పి తీసుకురావాలి .. అర్జెంట్. ఓవరు"

ఆశ్చర్యంగా వింటూండి పోయారు కాక్ పిట్‌లోని ఇద్దరూ.

"హలో. కెన్ యు రీడ్ మి? వెంటనే విమానం వెనక్కి మళ్ళించాలి. అర్జెంట్ ఓవర్" మళ్ళీ వినిపించింది.

"రిసీవ్‌డ్ దిమెసేజ్ కాని ఎందుకు? ఓవర్" కో పైలట్ రేడియోలో ప్రశ్నించాడు కంట్రోల్‌రూమ్‌ని.

"ఇప్పుడే మాకు సమాచారం అందింది. మీ విమానంలో ఓ టైం బాంబు వుంది ఓవర్"

ఉలిక్కిపడి ఇద్దరూ ఒకరిమొహాలు ఒకరు చూసుకున్నారు.

"అది ఏ క్షణంలోనయినా పేలవచ్చు, ఎన్నిగంటలకి పేలుతుందో తెలియులేదు. వెంటనే విమానం వెనక్కి మళ్ళించండి. ఓవర్"

"మేం తిరిగి వస్తున్నాం"

గొణిగారు ఇద్దరూ.

విమానాన్ని మళ్ళీ వెనక్కి, డిల్లీవైపు తిప్పారు ఇద్దరూ.

డిల్లీ పాలం ఏర్ పోర్టులో దిగబోయేముందు మైకులో చెప్పాడు పైలట్ పేసెంజర్సుకి.

"లేడీస్ అండ్ జంటిల్ మెన్. కొద్దిక్షణాల్లో విమానం పాలం ఏరుపోర్టులో దిగబోతోంది మళ్ళీ. మనం వెనక్కి వచ్చేసాం కారణం...."

కొన్ని క్షణాలు ఆగి చెప్పాడు నెమ్మదిగా.

"మన విమానంలో టైంబాంబు వుందని తెలిసింది. ఎవరూ ఖంగారు పడాల్సిన భయంలేదు. నిర్భయంగా నడుముకి బెల్టు బిగించు కోండి. కొన్ని నిముషాలలో మనం ఈ విమానంనుంచి దిగిపోవచ్చు."

భయంతో బిగుసుకుపోయారు అందరూ. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, వుగ్గ బెట్టుకుని కూర్చున్నారు అందరూ, క్రిందకి చూస్తూ.

విమానం ముందరి చక్రాలు మొదట, తర్వాత వెనకచక్రాలు రన్ వే మీద తాకి పరిగెత్తి కొంచెం దూరంలో ఆగిపోయింది విమానం.

ఓ ట్రక్ మెట్లని అమర్చింది విమానానికి. ఫైర్ ఇంజన్స్ నాలుగు విమానం చుట్టూ మూగాయి. కొద్దిదూరంలో రెండు అంబులెన్స్లు సిద్ధంగా వున్నాయి.

ఒకళ్ళ నొకళ్ళు తోసుకుంటూ దిగుతున్నారు. అందరూ విమానం లోంచి, గుంపుగా, ప్రాణభయంతో.

* * *

మినిస్ట్రీ ఆఫ్ ఇండస్ట్రీస్ ఇచ్చిన విందు పూర్తయిన తర్వాత, హోటల్లో సామానులు తీసుకుని, ఏర్ పోర్ట్ వైపు వెళుతున్నారు కృప లాని, అతని పర్సనల్ శెక్రటరీ.

"నాకోసం విమానం ఆపించగలిగావంటే నమ్మలేక పోతున్నాను" అన్నాడు కృపలాని.

"నిజంగా ఆ పని చేయగలిగాను"

"ఎలా?"

"మీరు నన్ను క్షమించాలి. చిన్న అబద్ధం ఆడి ఆ విమానాన్ని ఆపించ గలిగాను"

"ఏం అబద్ధం ఆడావు?"

"దినపత్రికలలో చాలాసార్లు చూస్తూంటాం ఇలాంటి వార్తలు. విమానం బయలుదేరబోయే అయిదునిముషాలముందు ఫోన్ చేసాను ఏర్‌పోర్ట్ అధికారులకి"

"ఏమని?"

"బాంబేకి వెళ్ళే విమానంలో టైంబాంబు వుందని ఫోన్ చేసి చెప్పాను. నిజమనుకుని భయపడి, పేసెంజర్సుని అందరినీ దింపి విమానం అంతా వెతుకుతారు, ఎక్స్‌ప్లోజివ్ ఎక్స్‌పర్ట్స్. చివరికి ఏమీ లేదని తేలుతుంది. మళ్ళీ బయలుదేలుతుంది విమానం"

"విమానం వుందో, మళ్ళీపోయిందో తెలుసా ఇప్పుడు?"

"ఫోన్‌చేసి కనుక్కున్నాను. మరో పావుగంటలో బయలుదేరు తుందట"

"మనకోసం మిగతా అందరి సమయం చెడగొట్టడం మంచిది కాదు" అన్నాడు కృపాలాని మందలింపుగా.

"రేపు మీరు ఏన్యువల్ జనరల్ బాడీ మీటింగ్‌లో వుండకపోతే ఇబ్బంది కదా? అందుకనే మీ అనుమతి లేకుండా ఇంత ధైర్యంచేసాను"

చిరునవ్వు నవ్వి అన్నాడు కృపాలాని.

"రేపు పేపర్లో పడుతుంది. ఫాల్స్ బాంబ్ స్కేర్ వల్ల ఢిల్లీ బాంబే ఫ్లయిట్ ఆలస్యంగా బయలు దేరిందని.

"అవును. ఇది దాదాపుగా రైల్లో అలారమ్స్ చెయిన్ లాగడం లాంటిదే. రెండూ చెడ్డవే." అన్నాడు కృపాలాని పర్సనల్ సెక్రటరీ.

కారు పాలం ఏర్‌పోర్ట్ కారు పార్కులాట్‌లో ఆగింది. కృపాలాని

అతని సెక్రటరీ కారు దిగి ఏర్‌పోర్టులోని బేగేజ్ చెక్‌కౌంటరువైపు వెళ్ళాడు టిక్కెట్లతో.

"సారీ! ఈ టిక్కెట్లు పనికిరావు ఇప్పుడు." చెప్పాడు కౌంటరు లోని వ్యక్తి వాటిని పరీక్షించి.

"ఎందుకు పనికిరావు? ఇవి బొంబేకి వెళ్ళే విమానంలో రిజర్వు చేయబడ్డ సీట్లవి, కన్‌ఫాం కూడా చేయబడ్డాయి. ఇంకా ప్లేన్ ఇక్కడే వుందిగా.

"ఈ టిక్కెట్లు రిపోర్టింగ్ టైంలో రాలేదు ఇక్కడకి. ఇప్పుడె వస్తున్నారు మీరు. నాదగ్గర వీటికి సంబంధించిన పేపర్లు లేవుఇప్పుడు."

"డామిట్. అయితే ఎవరిని కలుసుకోవాలి?"

కౌంటరులో కూర్చున్నతను, ఎవరిని కలుసుకోవాలో చెప్పాడు.

తనని పరిచయం చేసుకున్నాడు కృపలాని.

"అవును. ఈ టిక్కెట్లు వేలిడ్ కావు ఇప్పుడు" చెప్పాడు ఏర్ లైన్స్ ఆఫీసరు.

"ప్లేన్ ఇంకా వేళ్ళలేదుగా?"

"లేదు ఒకసారి వెళ్ళి, మళ్ళీ వెనక్కి తిరిగి వచ్చింది.

"దేనికి?" అడిగాడు సెక్రటరీ కుతూహలంగా.

"ఆ ప్లేన్‌లో టైంబాంబు వుందన్నవార్త మాకు తెలిసింది"

"ఎలా?"

"ఎవరో టెలిఫోన్ చేసి చెప్పారు, ప్లేన్ ఎగిరేసమయానికిరేడియే ఆపరేటరుకి ఆ సంగతి అందేటప్పటికి ఆలస్యం అయింది. పైకి వెళ్ళిన విమానం వెనక్కి వచ్చి ఆగింది మళ్ళీ.

"ఈ విధంగా నవ్వులాటకు ఫోన్ చేయటం పరిపాటి అయిపో యింది చాలామందికి. అనవసరంగా టైం వృధా అయిపోతుంది.

కృపలాని అన్నాడు విసుగు కనపరుస్తూ. సెక్రటరీ కర్చీప్‌తో మొహం తుడుచుకున్నాడు.

"అవును. ఈ విధంగా మాకు చాలాసార్లు ఫాల్స్ కాల్స్ వస్తుంటాయి. కాని ఈసారి వచ్చింది ఫాల్స్‌కాల్ కాదు"

"అంటే?"

ఆతృతని అణచుకుంటూ అడిగాడు సెక్రటరీ.

"తప్పుడు సమాచారం అందలేదు మాకు"

"కర్చీఫ్ జేబులో పెట్టుకుని అడిగాడు సెక్రటరీ.

నిజంగా టైంబాంబు వుందా?"

"వుంది. విమానం తిరిగి రాగానే. ఎక్స్‌ప్లోజివ్ ఎక్స్‌పర్ట్స్ విమానాన్ని గాలించారు పూర్తిగా. కాక్‌పిట్ అడుగు భాగంలో. అతి నైపుణ్యంగా అమర్చబడి వుంది ఓ సున్నితమయిన టైంబాంబు. విమానం బయలుదేరిన గంట తర్వాత పేలే విధంగా అమర్చబడి వుంది. అది"

కృపలాని, అతని సెక్రటరీ ఒకరి మొహాలవంక మరొకరు చూచున్నారు ఆశ్చర్యంగా.

"అంటే. ఆ ఫోన్ కాల్ రాకపోతే విమానం పేలిపోయేదా గంట తర్వాత?"

అడిగాడు కృపలాని, అధికారి తెల్ల యూనిఫాంవంక చూస్తూ.

"తప్పకుండా"

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా వుండిపోయారు ముగ్గురూ.

"రేపు ఓ ముఖ్యమయిన మీటింగ్‌కి హాజరవ్వాలి నేను. ఎలాగయిన ఈ విమానంలో వెళ్ళేలా చూడండి.

కొన్ని క్షణాలాలోంచి అన్నాడు ఏర్‌లైన్స్ అధికారి.

"మీరు రాకపోవడంతో మీ సీట్స్ వెయిటింగ్ లిస్టులో వున్న ఒకతనికి ఇవ్వబడింది. అయినా మీకో సీట్ దొరుకుతుంది. బాంబ్ భయంతో ఇద్దరు టికెట్స్ కేన్సిల్ చేసుకుని వెళ్ళిపోయారు దిగి"

"ఎక్స్‌ప్లోజివ్ ఎక్స్‌పర్ట్స్ ఆ బాంబుని కనుగొనకముందా."

"తర్వాతే_బహుశ వాళ్ళ కళ్ళబడకుండా మరోటి వుండి వుండ వచ్చునే నమ్మకంతో."

"ఆ సీట్స్ మా ఇద్దరికీ ఎలాట్ చేయగలరా?"

"నా చేతిలోలేదు అది. కంట్రోలర్‌ని కలుసుకోవాలి. అదుగో అటువైపు వెళ్ళాలి. గది తలుపుమీద రాసివుంటుంది కంట్రోలర్ అని" చూపించాడు చేత్తో దారి.

"థాంక్స్"

"బహుశ మీరు మళ్ళీ కొత్త టికెట్స్ కొనాల్సి వుంటుంది"

"ఫర్వాలేదు"

నడుస్తూ అన్నాడు సెక్రటరీ కృపలానీతో.

"చాలా ఆశ్చర్యంగావుంది నాకు. నేను ప్లేన్ ఆలస్యం అవటానికి ఫోన్‌చేసి, ప్లేన్‌లో టైంబాంబు వుందని అబద్ధం ఆడితే అది నిజ మయింది?"

"ఏ రిమార్కబుల్ కో ఇన్సిడెన్స్. నిజంగా ఎవరో టైంబాంబు అమర్చివుంటారు దానికి ముందరే. మనం ఫోన్ చేయటంవల్ల వెతికితే అది బయటపడ్డది."

"ఎర్‌ఫోర్స్ అధికారులు బాంబ్ పెట్టినవాళ్ళే ఫోన్‌చేసి నిజం చెప్పి వుంటారనే అభిప్రాయంతో వున్నారు."

"ఒక్క వాళ్ళేకాదు. నిజంగా ఆ బాంబు అమర్చిన వాళ్ళుకూడా ఎవరు ఆ సంగతి కనుక్కోగలిగి ఫోన్‌చేసి చెప్పి వుంటారా అనే ఆలో చనలో వుంటారు."

"నాకు తెలియకుండానే నేను రెండువందల పదిహేడుమంది ప్రాణాలని కాపాడానన్నమాట"

సెక్రటరీ మాటల్లో ఎక్సైట్‌మెంటు, వుత్సాహం తొంగి చూస్తు న్నాయి.

"వాళ్ళుగాక మరో ఏడుగురు ఇద్దరు పైలట్లు, మరో అయిదుగురు విమానం క్రూ"

"చాలా కాకతాళీయంకదూ సార్?"

"అవును. చాలా అద్భుతమయిన కాకతాళీయం. నేను సరిగ్గా సమయానికి ప్లేన్ అందుకోగలిగి వుంటే ఈపాటికి విమానం కూలి...."

"మనం చెడ్డగురించి ఆలోచించకూడదు"
"స్ట్రేంజ్ బట్ ట్రూ."
జరిగిన సంఘటనలని దృష్టిలో పెట్టుకొని అన్నాడు కృపలాని.

ఇద్దరూ కంట్రోలర్ రూంలోకి వెళ్ళారు. అయిదు నిముషాల చర్చ తర్వాత ఇద్దరూ ఆ ప్లేన్‌లో బాంబేకి వెళ్ళవచ్చని చెప్పాడు కంట్రోలర్, కొత్త టికెట్స్ కొని.

అరగంట తర్వాత విమానం గాలిలో ఎగురుతూండగా కాక్‌పిట్‌లోని పైలట్ రేడియోలో చెప్పాడు గ్రాండ్‌కంట్రోలర్‌కి, తన పొజిషన్ చెక్ చేసి.

"హలో జీరో. ఫోర్. త్రీ సిక్స్. నాట్. ఓవర్"

"మెసేజ్ రిసీవడ్ ఓవర్"

గ్రౌండ్ కంట్రోల్ నుంచి వినిపించింది రేడియోలో.

ప్లేన్‌లో కూర్చున్న పేసెంజర్సుతో మాట్లాడేందుకు వుద్దేశించబడిన మైక్‌లో చెప్పాడు పైలట్.

"లేడీస్ అండ్ జంటిల్‌మెన్. నాలుగయిదు గంటలక్రితం సరిగ్గా ఇక్కడనుంచే మనం విమానాన్ని వెనక్కి తిప్పి తీసుకువెళ్ళింది. విమానం పొలంలో రన్‌వే మీద ఆగి మనమంతా విమానానికి దూరంగా పారిపోయే దాకా.... అదంతా మర్చిపోలేని థ్రిల్లింగ్ అనుభవం. మనం బాంబేకిమరో రెండు గంటల్లో చేరతాము. విష్ యు ఆల్ ఎ హేప్పీ, ఫ్రమ్ బాంబ్సే జర్నీ."

తన సెక్రటరీ చేయి ఆప్యాయంగా నొక్కి అన్నాడు కృపలాని.

"కంగ్రాచ్యులేషన్స్. నీ ఇంక్రిమెంట్ డ్యూ ఎప్పుడు?" ప్రయాణికుల్లో చాలాభాగం ఇంకా ఆ బాంబ్ గురించే మాట్లాడుకుంటున్నారు."

* * *

ఉదయం మీటింగు చివరి ఏర్పాట్లు స్వయంగా తనిఖీ చేస్తున్నాడు కృపలాని పర్సనల్ సెక్రటరీ.

"అన్నీ రెడీసార్. నేను చూశాను ఏర్పాట్లన్నీ." పదిన్నరకి. కృపలాని ఇంటికి టెలిఫోన్ చేసి చెప్పాడు సెక్రటరీ.

"ఇవాళ ఉదయం పేపరు చూశావా?" అడిగాడు కృపలాని.

"చూశాను సార్. నిన్నటి సంఘటన గురించి వ్రాశారు."

బాంబ్ గురించి కాదు నేను చెప్పేది. దానికిందే మరోవార్తవుంది. "గూఢచారి హత్య అని"

"చూడలేదు దాన్ని."

"అయితే చదువు. నిజమయిన కాకతాళీయం అంటే అది"

రిసీవరు క్రెడిల్‌మీద పెట్టి, పేపరు అందుకొని మొదటి పేజీలో చివర చూశాడు సెక్రటరీ.

ప్లేన్‌లో టైంబాంబుకి సంబంధించిన వార్తకిందనే మరోవార్త.

"నిన్న ఢిల్లీ పోలీసులు శాంతిమార్గ్ ప్రాంతంలో ఆగివున్న కారులోని ఓ చైనీస్ శవం కనుగొన్నారు. ఈ చైనీస్ చాలాకాలంగా భారతదేశంలో చైనా గూఢచారిగా వ్యవహరిస్తున్నాడని అనుమానిస్తున్నారు ఢిల్లీ పోలీసులు. అతని దగ్గర దొరికిన కొన్ని పత్రాలవల్ల.

నిన్న సాయంత్రం పాలంనుంచి బయలుదేరే ఓ విమానాన్ని పేల్చివేయడానికి ఇతను ఏర్పాట్లు చేశాడని తెలుస్తోంది. ఆ విమానంలోనే ప్రయాణం చేసిన అమెరికన్ రాయబారిని చంపే వుద్దేశంతో ఈ ఏర్పాటు జరిగి వుండవచ్చుని వూహిస్తున్నారు పోలీసులు.

కాని, ఎందువల్లో విమానం బయలుదేరే సమయానికి హంతుడు తను అమర్చిన బాంబ్ గురించి వెల్లడిచేయటంవల్ల, విమానంనుంచి ఆ బాంబ్ వేరుచేయబడి, అమెరికన్ రాయబారి ప్రాణాలు కాపాడబడ్డాయి. ఆకోపంతో ఇతన్ని ఈ పనికి నియమించినవాళ్ళు హత్య చేసివుండవచ్చుని కూడా వూహిస్తున్నారు."

"తనో గూఢచారి మరణానికి కారణం కాగలిగాననీ, కాకతాళీయంగా రెండువందల ఇరవై రెండుమంది ప్రాణాలనీ, లక్షలఖరీదుచేసే విమానాన్ని కాపాడగలిగాననీ గర్వపడ్డాడు, కృపలాని పర్సనల్ సెక్రటరీ.

(అపరాధ పరిశోధన నవంబర్ 1972)